సాక్షి విశాఖపట్నం

ఆదివారం | 8 | జనవరి | 2023



పనిచేసిన ఇంట్లోనే దొంగతనం మెయిన్ 10లో

రూ.15 లక్షల నగలు, నగదు స్వాధీనం



మిద్దెతోట.. ప్రతి ఇంటికీ ఆరోగ్య బాట IVలో



రక్షకులు IVలో

న్యూస్‌రీల్

ఏఎంసీలో వైద్య విద్య– పరిశోధనపై సదస్సు



మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్‌లో భాగంగా అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్(ఏపీపీఐ) ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం ఆంధ్రా మెడికల్ కాలేజీలో సదస్సు జరిగింది. ముందుగా కమిటీ ప్రతినిధి డాక్టర్ పి.వి.సుధాకర్ సదస్సు లక్ష్యాలను వివరించారు. మాజీ డీఎంఈ, అపోలో యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ టి.రవిరాజు మెడికల్ ఎడ్యుకేషన్ ఎట్ క్రాస్‌రోడ్స్ అనే అంశంపై ప్రసంగించారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ అభిజత్ షేత్ నేషనల్ మెడికల్ కమిషన్ గురించి, వైద్యరంగంలో భారతదేశ అవసరాల గురించి వివరించారు. న్యూయార్క్‌లోని బ్రాంక్స్ కేర్ ఆస్పత్రి ఫిజీషియన్–ఇన్–చీఫ్ డాక్టర్ శ్రీధర్ చిలిమూరి 'అమెరికాలోని మెడికల్ ఎడ్యుకేషన్‌తో పాటు ఎడ్యుకేషన్‌లో పరిశోధనలను ఎలా చేయాలి'అనే అంశంపై ప్రసంగించారు. వైద్య విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. హైదరాబాద్‌లోని అపోలో మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ రేఖా ఆర్కాట్ ఎంబీబీఎస్ తర్వాత కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. అమెరికాకు చెందిన డాక్టర్ లోకేష్ ఈదర వైద్య విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు సమ్మిట్, డాక్టర్ బి.దేవి మాధవి, డాక్టర్ వై.పద్మశ్రీ తదితరులు మాట్లాడారు. సుమారు 250 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోల్లో పరిమితి మించితే కఠినచర్యలు

గోపాలపట్నం: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే కఠిన చర్యలు తప్పవని ఉప రవాణ కమిషనర్ రాజారత్నం హెచ్చరించారు. నగరంలో ఆటోల్లో అధికంగా ప్రయాణికులను ఎక్కించుకొని తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే ఆటోలపై కేసులు నమోదు చేయడంతోపాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. సరుకు రవాణా చేసే ఆటోలు ఓవర్‌లోడ్‌తో ప్రయాణించినా ఉపేక్షించమన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.18.86 లక్షలు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): ఆశీలమెట్టలో శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 21 రోజులకు గాను రూ.18,86,916 లక్షలు, 23.700 గ్రాముల బంగారం, 198 గ్రాముల వెండి, 109 యూఎస్‌ఏ డాలర్స్, 100 సింగపూర్ డాలర్స్, 5 ఇంగ్లండ్ పౌండ్స్, 50 ఇండోనేషియా రింగిట్స్, 5 యూరోలతో పాటు 111 చెక్కులు వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.బోశస్ తెలిపారు. శివజ్యోతి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు ఆదాయాన్ని లెక్కించారు.

19న 21 వాహనాల ఈ-వేలం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేయని 21 వాహనాలను ఈ నెల 19న ఈ-వేలంలో విక్రయిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేలం-1లో 11 వాహనాలు, 2 గంటల నుంచి 5 గంటల వరకు వేలం-2లో 10 వాహనాలను వేలం వేస్తామన్నారు. ఇతర వివరాల కోసం https://konugolu.ap.gov.in/ను సందర్శించాలని సూచించారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్



- నిరంతర దాడులు నిర్వహిస్తున్న ఏపీఈపీడీసీఎల్
- ఏడాది కాలంలో రూ.5.02 కోట్ల జరిమానాలు
- ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు
- సిబ్బంది నిర్లక్ష్యంపైనా కేసులు నమోదు

సాక్షి, విశాఖపట్నం : అక్రమార్కుల చర్యలతో విద్యుత్ శాఖకు జరుగుతున్న నష్టంపై విజిలెన్స్ ఉక్కుపాదం మోపుతోంది. చౌర్యానికి పాల్పడుతున్న వినియోగదారులపై కొరడా ఝుళిపిస్తూ.. కోట్ల రూపాయల అపరాధ రుసుము వసూలు చేస్తోంది. ఆకస్మిక తనిఖీలు చేస్తూ అనధికారికంగా విద్యుత్ వాడుతున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గించే చర్యలకు ఉపక్రమించింది. ఓ వైపు విద్యుత్ దొంగలను పట్టుకుంటూ.. విద్యుత్ శాఖలో ఉన్న పని దొంగలపైనా తనదైన శైలిలో చెక్ పెడుతోంది. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా విద్యుత్ చౌర్యం, అక్రమ విద్యుత్ వినియోగం కారణంగా వినియోగదారులకు పూర్తిస్థాయిలో విద్యుత్‌సేవలు అందించలేకపోతున్న విషయం గుర్తించిన సీఎం వైఎస్ జగన్.. వాటి నియంత్రణపై దృష్టి సారించాలని డిస్కమ్‌లని ఆదేశించారు. ఈ నేపథ్యంలో తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) పరిధిలో విజిలెన్స్ అధికారులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. అక్రమ విద్యుత్ వినియోగం, చౌర్యం, పర్మిషన్ లేని ఓవర్ లోడ్ వినియోగం, మీటర్ల ట్యాంపరింగ్ వంటి అక్రమాల అంతు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఏడాది కాలంగా ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిల్స్ పరిధిలో విజిలెన్స్ దాడులు విస్తృతంగా నిర్వహించారు. 2022–23కి సంబంధించిన వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. పరిధిలో 2022 జనవరి 1 నుంచి డిసెంబర్ 24 వరకూ నిర్వహించిన దాడుల్లో ఆపరేషన్ వింగ్, డీపీఈ వింగ్ సహకారంతో మొత్తం 6,385 కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి అసెస్మెంట్, కాంపౌండింగ్ రుసుము కింద రూ.5.02 కోట్లు వసూలు చేశారు. విజిలెన్స్ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. 2022లో 277 క్వాలిటీ కేసుల్ని విజిలెన్స్ సిబ్బంది నమోదు చేసి రూ.3.38 కోట్లు అపరాధ రుసుం వసూలు చేశారు.

నిర్లక్ష్య సిబ్బందిపైనా చర్యలు

విద్యుత్ సేవలు మరింత మెరుగు పరిచేందుకు విద్యుత్ సిబ్బంది పనితీరు కూడా ఒక ప్రామాణికంగా భావిస్తున్న విజిలెన్స్ ఆ దిశగానూ చర్యలకు ఉపక్రమిస్తోంది. విద్యుత్ శాఖ ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపై విచారణలు వేగవంతం చేస్తోంది. వినియోగదారులకు అందాల్సిన సేవల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదుల్ని క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతోంది. గతేడాది కాలంలో విద్యుత్ ఉద్యోగులపై 83 పిటిషన్లు రాగా.. ఇందులో 58 పిటిషన్లపై విచారణ పూర్తి చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఈపీడీసీఎల్ సీఎండీకి విజిలెన్స్ అధికారులు నివేదికలు అందించారు.

ఏపీడీసీఎల్ పరిధిలో 2022లో విద్యుత్ చౌర్యం కేసులు

నెల	నమోదైన కేసులు	వసూలు చేసిన మొత్తం
జనవరి	499	40,27,450
ఫిబ్రవరి	631	54,55,731
మార్చి	665	52,89,902
ఏప్రిల్	534	59,11,105
మే	560	39,54,615
జూన్	554	33,78,834
జులై	523	37,42,070
ఆగస్ట్	475	43,09,710
సెప్టెంబర్	618	41,81,245
అక్టోబర్	495	28,59,718
నవంబర్	440	35,82,597
డిసెంబర్ 24 వరకు	391	35,67,472
మొత్తం	6385	5,02,60,449

1912కి ఫిర్యాదు చేయండి



ఏపీఈపీడీసీఎల్ పరిధిలో కొంత కాలంగా ట్రాన్స్‌ఫార్మర్లని దొంగిలించడం వంటి ఘటనలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై దృష్టిసారించారు. నైట్ పెట్రోలింగ్‌తో వీటిని నివారించాం. అదే విధంగా హెచ్‌టీ లైన్స్‌పై స్పెషల్ రైడ్స్ నిర్వహిస్తున్నాం. మరమ్మతులు నిర్ణీత కాలంలో నిర్వహించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నివేదికలు ఇస్తున్నాం. విద్యుత్‌కు సంబంధించిన పనులు చేయిస్తాం. వ్యవసాయ బోరుకు కనెక్షన్లు ఇప్పిస్తామని ఎవరైనా మోసం చేయాలని చూస్తే విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ప్రజలంతా విద్యుత్‌ని పొదుపుగా వాడాలని, సమస్య పరిష్కరించేందుకు సిబ్బంది ఎవరైనా డబ్బులు అడిగినా 1912 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– ఏవీఎల్ ప్రసన్నకుమార్, ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్

ఎన్‌ఐపీలోకి హెచ్‌పీవీ వ్యాక్సిన్



బాలికలకు వ్యాక్సిన్ అందిస్తున్న మంత్రి రజని, కలెక్టర్ మల్లికార్జున, మేయర్ హరివెంకట కుమారి

- కేంద్రానికి సీఎం జగన్ సిఫార్సు చేశారు
- మంత్రి విడదల రజని వెల్లడి

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): జాతీయ రోగ నిరోధక ప్రోగ్రాం(ఎన్‌ఐపీ)లోకి హెచ్‌పీవీ వ్యాక్సిన్ చేరనుందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని వెల్లడించారు. గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌లో భాగంగా ఎంవీపీకాలనీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రిలో శనివారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి రజని ముఖ్య అతిథిగా పాల్గొని బాలికలకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. తన నియోజకవర్గంలో నిర్వహించిన సర్వేలో 200 మంది బాలికలకు ఈ లక్షణాలు ఉన్నట్లు తేలిందన్నారు. ఇదే పరిస్థితి అన్ని చోట్ల ఉందన్నారు. గర్భాశయ క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయడానికి ముందస్తు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ మంచి పరిష్కారమన్నారు. ఈ నేపథ్యంలోనే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను నేషనల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో చేర్చాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి సూచించినట్లు చెప్పారు. త్వరలోనే ఇది సాకారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పి ఇండియా ఫౌండేషన్ ద్వారా మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యం నగర బాలికలకు 200 డోసుల వ్యాక్సిన్ అందించడం అభినందనీయమన్నారు. అప్పి ఫౌండేషన్ యూఎస్‌ఏ అధ్యక్షుడు డాక్టర్ కొల్లి రవి మాట్లాడుతూ హెచ్‌పీవీ ముందస్తు వ్యాక్సినేషన్ ద్వారా 90శాతం గర్భశయ క్యాన్సర్‌ను అరికట్టవచ్చన్నారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి మధ్య బాలికలకు ఆరు నెలల వ్యవధిలో రెండు డోసుల వ్యాక్సిన్ అందించాల్సి ఉంటుందన్నారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కలెక్టర్ మల్లికార్జున, ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ, డీఈవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖలో కాల్ సెంటర్

- 1967తో టోల్ ఫ్రీ నంబర్
- 10వ తేదీ నుంచి అమలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పౌరసరఫరాల శాఖలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను 1967 నెంబర్‌తో ఏర్పాటు చేశారు. ఈ టోల్ ఫ్రీ నంబర్ ఈనెల 10వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుంది. వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖకు సంబంధించిన ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలెండర్, పెట్రోల్ బంకులు, తూనికలు కొలతలు, బియ్యం కార్డు సేవలు తదితర ఫిర్యాదులు అన్ని స్వీకరిస్తారు. వచ్చిన ఫిర్యాదులను రిజిస్టర్ చేసి నమోదు సంఖ్యను తెలియజేస్తారు. ఈ ఫిర్యాదును సంబంధిత శాఖకు పరిష్కారం నిమిత్తం పంపిస్తారు. ఫిర్యాదు ఏ దశలో ఉన్నదీ, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉన్నదీ అనేది కూడా వినియోగదారుడికి ఇచ్చిన రిజిస్ట్రేషన్ నెంబర్ ద్వారా ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం కల్పించారు. ప్రతి రోజు ఆఫీసు పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందరికి అందుబాటులో ఉంటుంది.

మత్స్యకారుల అభివృద్ధికి పెద్దపీట



చేపల మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, చిత్రంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, కలెక్టర్ మల్లికార్జున



కుళాయిని పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు, ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే వాసుపల్లి కలెక్టర్ మల్లికార్జున

- మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు
- ఆధునిక చేపల మార్కెట్ భవనం ప్రారంభం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): మత్స్యకారుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర మత్స్య, పాడి, పశుగణాభివృద్ధి శాఖ మంత్రి డా.సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో రూ.2.75 కోట్లతో నిర్మించిన ఆధునిక చేపల మార్కెట్ భవనాన్ని మంత్రి అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆధునిక పరిశుభ్రమైన చేపల మార్కెట్ భవనం ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, 116 మంది మత్స్యకారులు చేపలు అమ్ముకునేందుకు వీలుగా భవనం నిర్మించామన్నారు. ఈ మార్కెట్ ఫిషరీస్ డిపార్టుమెంటు అనుసంధానంతో నిర్వహిస్తారని తెలిపారు. మత్స్యకార భరోసా, మోటర్ బోట్లకు డీజిల్ సబ్సిడీ వంటి పథకాలతో ఎంతోమంది మత్స్యకారులు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. డొమెస్టిక్ ఫిష్ మార్కెటింగ్, కేజ్ కల్చర్, లైఫ్ ఫిష్ వెండింగ్ యూనిట్లు మొదలుపెట్టే వారికి ప్రభుత్వం సబ్సిడీ, స్థలం మంజూరు చేసి ప్రోత్సహిస్తామన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ సుమారు 10,000 కుటుంబాలు ఫిషింగ్ హార్బర్‌లో చేపలు, రొయ్యలు విక్రయాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని, వాటిని విక్రయించేందుకు స్థలం శుభ్రంగా ఉండడం లేదని విక్రయదారులు అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునిక పరిశుభ్రమైన చేపల మార్కెట్ నిర్మించిందన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ఎంతోకాలంగా మత్స్యకారులు ఎదురుచూస్తున్న ఆధునిక పరిశుభ్రమైన చేపలమార్కెట్ భవనం ప్రారంభించామన్నారు. దీనిని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, ఫిషరీస్ జేడీ టి.సుమలత, ఫిషరీస్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్ చంద్ర, మెకనైజ్డ్ బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్, ప్రతినిధులు బర్రి కొండ బాబు, వార్డ్ కార్పొరేటర్లు మత్స్యకార మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులపై చంద్రబాబుకు సదాభిప్రాయం లేదు

మత్స్యకారుల పట్ల చంద్రబాబుకు ఎప్పుడు సదాభిప్రాయం లేదని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు అన్నారు. టీడీపీ హయాంలో మత్స్యకారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. మత్స్యకారులు అంటే చంద్రబాబు చులకనగా చూసేరని, మమకారం లేదని, ఆదరణ చూపలేదని విమర్శించారు. మత్స్యకారుల సంక్షేమానికి, అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు చేపట్టారన్నారు. ఈ రోజు సిదిరి అప్పలరాజు మంత్రి అయ్యారంటే సీఎం జగన్ చలవే అని అన్నారు.

సంక్షేమంలో మనమే నంబర్ వన్

- వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి
- దేశంలోనే వైఎస్సార్‌సీపీ ఆదర్శం
- ఏపీలో 174 సీట్లు గెలుచుకుంటాం
- గాజువాక, భీమిలిలో ఆత్మీయ సమావేశాలు




మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, ఎమ్మెల్యే నాగిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో గాజువాక వైఎస్సార్ సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో విశాఖ జిల్లాలో క్లీన్‌స్వీప్ దిశగా అందరూ పనిచేయాలన్నారు. టీడీపీ హయాంలో పేదలకు అమలుచేసే పథకాల సొమ్మును జన్మభూమి కమిటీలు స్వాహా చేసేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అవినీతికి అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. నేరుగా పేదల బ్యాంక్ ఖాతాల్లోనే పథకాల లబ్ధి జమ అవుతోందన్నారు. 2014–19లో టీడీపీ అవినీతి గురించి ప్రస్తావించని పచ్చ మీడియా, వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విషప్రచారం చేస్తోందని విమర్శించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లను సమన్వయం చేసుకుంటూ త్వరలోనే ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పరిశీలకులు క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. వలంటీర్ల వ్యవస్థతో పాటు పార్టీ సమాంతర వ్యవస్థ కూడా ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

హౌస్ కమిటీ సమస్య కొలిక్కి

గాజువాక హౌస్ కమిటీ భూముల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సమస్య విషయమై తాను కూడా పలుమార్లు అధికారులతో చర్చించానన్నారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ సమస్య కొలిక్కి వస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు దామా సుబ్బారావు, మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు. గాజువాక నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను పలువురు నాయకులు సుబ్బారెడ్డి దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సమష్టిగా పనిచేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

కొమ్మాది (భీమిలి): వచ్చే ఎన్నికల్లో మన టార్గెట్ 174 స్థానాలు. అందుకు అంతా సమష్టిగా పనిచేద్దామని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. కాపులుప్పాడలో శనివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలోనే అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. వీటిని చూడలేకే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, వీటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో 175కు 175 ఎమ్మెల్యే సీట్లు గెలిచి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నియోజకవర్గ సమస్యలు, పలు అభివృద్ధి కార్యక్రమాలను వైవీ సుబ్బారెడ్డికి వివరించారు. అనంతరం మండలాలు, వార్డులు, పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నాయకులు వైవీ సుబ్బారెడ్డిని గజమాలతో సత్కరించారు.

పందులు తరలించకపోతే కఠిన చర్యలు

- పెంపకందారులకు కమిషనర్ హెచ్చరిక

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నగర పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పందులను స్వచ్ఛందంగా తరలించాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పెంపకందారులకు సూచించారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే పందుల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని.. పెంపకందారులను పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదన్నారు. పలు ప్రాంతాల్లో పందులు ఇళ్లలోకి దూరి వృద్ధులు, పిల్లలపై దాడి చేస్తున్న ఘటనలు తన దృష్టికి వచ్చాయన్నారు. అందుకే నగరానికి దూరంగా పందులను తరలించాలన్నారు. వీధి కుక్కలను పట్టుకుని వాటికి ఆపరేషన్‌తో పాటు వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు తెలిపారు. పెంపుడు కుక్కలకు జీవీఎంసీ నుంచి లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పశువులను రోడ్లపై రాత్రిపూట వదిలేస్తున్నారని, వాటి వల్ల కూడా రోడ్లు అపరిశుభ్రానికి గురవుతున్నాయన్నారు. రోడ్ల సెంట్రల్ మీడియన్లలో ఉన్న మొక్కలను తినేస్తున్నాయని.. వాటి వల్ల వాహనచోదకులు ప్రమాదానికి గురవుతున్నారన్నారు. ఇకనుంచైనా రోడ్లపై పశువులు, పెంపుడు జంతువులు విడిచిపెట్టకుండా చర్యలు తీసుకోవాలని.. పట్టుబడితే వాటి యజమానులకు అపరాధ రుసుం విధిస్తామని కమిషనర్ రాజాబాబు హెచ్చరించారు.

సిరులతల్లికి తుమ్మిడి బ్రదర్స్ బంగారు హారం బహూకరణ



బంగారు హారాన్ని ఆలయ ఇవో కె శిరీషకు అందజేస్తున్న తుమ్మిడి రామ్‌కుమార్, తుమ్మిడి బాబీ

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): తుమ్మిడి బ్రదర్స్ 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి రూ.లక్షా 60 వేలు విలువ చేసే 26 గ్రాముల 162 మిల్లీ గ్రాముల బంగారు హారాన్ని తుమ్మిడి బ్రదర్స్ అధినేత, బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు తుమ్మిడి రామ్‌కుమార్ శనివారం బహూకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీషకు బంగారు హారాన్ని అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారిచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ మెండుగా లభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తుమ్మిడి బ్రదర్స్ ప్రతినిధి తుమ్మిడి బాబీ, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ధర్మకర్తలు బుద్ధల అనురాధ, మళ్ల ధనలత ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ లెక్క తేల్చాల్సిందే..

- కమిటీ సభ్యుల ప్రశ్నలకు మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ల తెల్లముఖం

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): మలేరియా నియంత్రణలో జరుగుతున్న అవకతవకలపై వేసిన కమిటీ శనివారం తొలిసారి సమావేశమైంది. ప్రజారోగ్య విభాగం పలు వార్డుల్లో ఫాగింగ్ యంత్రాల వాడుక, వినియోగిస్తున్న డీజిల్, పెట్రోల్‌కు సంబంధించి గత కౌన్సిల్ సమావేశంలో సభ్యులు పలు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై మేయర్ సమగ్ర విచారణకు ఆదేశించారు. వచ్చిన నివేదిక మేరకు 8 మంది సభ్యులతో కమిటీ వేశారు. ఈ కమిటీ శనివారం సమావేశమైంది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మలేరియా ఇన్‌స్పెక్టర్లు తెల్లముఖం వేశారు. ఏటా రూ.5.30కోట్లు వ్యయం అవుతున్నట్టు చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో ఎక్కడా పనులు జరగడం లేదని సభ్యులు ఆరోపించారు. ప్రతీ వార్డుకు రోజుకు 18 లీటర్ల డీజిల్, 1.87 లీటర్ల పెట్రోలు కేటాయించి హ్యాండ్ ఫాగింగ్ చేయాలని చెబుతుండగా.. కార్మికులు కేవలం 5 నుంచి 6 లీటర్ల డీజిల్, లీటర్ పెట్రోల్ మాత్రమే వినియోగిస్తున్నట్టు సభ్యులు చెప్పారు. మిగిలింది ఇన్‌స్పెక్టర్లు బయట మార్కెట్‌లో విక్రయిస్తున్నట్టు ఆరోపించారు. మెగా ఫాగింగ్ యంత్రానికి రోజుకు 100 లీటర్ల డీజిల్ ఇస్తుండగా కేవలం 30 నుంచి 40 లీటర్లు మాత్రమే వినియోగిస్తున్నట్టు టీడీపీ కార్పొరేటర్, కమిటీ సభ్యుడు పిసిని వరహా నరసింహం పేర్కొన్నారు. ఇప్పటివరకు వినియోగించిన డీజిల్, పెట్రోల్ లెక్క తేల్చాలని మరో సభ్యుడు బొమ్మిడి రమణ డిమాండ్ చేశారు. వార్డుకు రోజుకు కేవలం 8 లీటర్లు మాత్రమే హ్యాండ్ ఫాగింగ్ మిషన్‌కు వినియోగిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని మరో సభ్యుడు పీవీ సురేష్ తెలిపారు. దీనిపై జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి మాట్లాడుతూ జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలోనే డీజిల్, పెట్రోల్ వ్యయం జరుగుతుందన్నారు. దీనిపై విచారణ జరిపిస్తామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పీవీ సురేష్, కొణతాల నీలిమ, ఇమ్రాన్ మహ్మద్, ఏజే స్టాలిన్, పిసిని వరహ నరసింహం, బొమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

డిబ్రూఘడ్-కన్యాకుమారి ఫ్రీక్వెన్సీ పెంపు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రస్తుతం బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా నడుస్తున్న డిబ్రూఘడ్-కన్యాకుమారి-డిబ్రూఘడ్ ఎక్స్‌ప్రెస్‌ను త్వరలో వారానికి నాలుగు రోజులు నడిచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.
మే 7 నుంచి డిబ్రూఘడ్‌లో బయల్దేరే డిబ్రూఘడ్-కన్యాకుమారి (15906) వివేక్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ శని, ఆది, మంగళ, గురువారాలలో వారానికి నాలుగుసార్లు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో కన్యాకుమారిలో మే 11 నుంచి బయల్దేరే కన్యాకుమారి-డిబ్రూఘడ్(15905)వివేక్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధ, గురు, శని, సోమవారాలలో వారానికి నాలుగుసార్లు బయల్దేరుతుంది.



ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు	10,295
బదిలీ కోసం వచ్చిన దరఖాస్తులు	5,868
ఇందులో కంపలర్సీ బదిలీ దరఖాస్తులు	1,010
రిక్వెస్ట్ బదిలీ దరఖాస్తులు	4,858
వచ్చిన గ్రీవెన్స్	663

అయ్యవార్లు.. అడ్డదారులు..!

- బదిలీల్లో ఉపాధ్యాయుల తప్పుడు పద్ధతులు
- పాయింట్ల కోసం స్పౌజ్ దుర్వినియోగం
- దరఖాస్తుల పరిశీలనతో వెలుగులోకి..
- 200 మందిని గుర్తించిన విద్యాశాఖాధికారులు
- సిద్ధమైన జాబితా, ఉపాధ్యాయుల్లో గుబులు
- పేర్లు తప్పించేలా డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

అగనంపూడి మండలంలోని ఓ ఉపాధ్యాయుడు విశాఖపట్నం సమీపంలోనే పాఠశాలలోనే పోస్టింగ్ దక్కించుకునేలా డిపెండెంట్‌కు గుండె జబ్బుకు పొందే ట్రీట్‌మెంట్‌తోనే ఏకంగా ఆపరేషన్ చేయించుకుంటున్నట్లు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చి, బదిలీల్లో ఎక్కువ పాయింట్లు పొందాడు. అతను పెట్టిన ధృవీకరణ పత్రంతో ఆ స్థాయిలో పాయింట్లు రావని గుర్తించిన విద్యాశాఖాధికారులు ఆ ఆప్షన్‌ను తిరస్కరించారు.

మాడుగుల మండలంలోని ఓ ఉపాధ్యాయురాలు గతంలో స్పౌజ్ కోటా వినియోగించుకున్నప్పటకీ, తాజాగా మళ్లీ అదే కోటాతో బదిలీ కోసమని దరఖాస్తు చేసి ఎక్కువ పాయింట్లు పొందారు. విద్యాశాఖాధికారుల పరిశీలనలో ఆ కోటా కింద పొందిన పాయింట్లను రద్దు చేశారు.

విశాఖ విద్య: ఉపాధ్యాయులందరికీ ఆమోదయోగ్యకరమైన రీతిలో బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. కొంతమంది సర్వీసు పరమైన అంశాలపై కోర్టును ఆశ్రయించారు. కోర్టు తుదితీర్పుకు అనుగుణంగా బదిలీల ప్రక్రియలో ముందుకెళ్లేందుకు అంతా సిద్ధం చేసుకోవాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు సీనియార్టీ జాబితాలపై కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో కొంత మంది ఉపాధ్యాయులు చేసిన తప్పిదాలు వెలుగులోకి వచ్చాయి. నచ్చిన చోట మళ్లీ తిష్ట వేయాలనే దుర్బుద్ధితో కొంతమంది అయ్యవార్లు తప్పుడు ధృవీకరణ పత్రాలతో బదిలీ కోసం దరఖాస్తు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలా 200 మందికి పైగానే ఉన్నట్లు లెక్క తేలింది.

ఆన్‌లైన్‌తో ముందుగానే చెక్

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో సొంత జిల్లాలోని సొంతూర్లకు దగ్గరగా వెళ్లేలా ఈ సారి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రాతిపదికన బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పారదర్శకత కోసం బదిలీల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే నిర్వహించేలా విద్యాశాఖాధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, ఈ సారి ఎంఈవో, డీఈవో స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. దీని వల్ల తప్పుడు పద్ధతులు అవలంబించిన వారిని ముందుగానే గుర్తించి, అలాంటి దరఖాస్తులను తిరస్కరించారు.

పేర్లు తప్పించేలా ప్రదక్షిణలు

బదిలీల్లో పొరపాట్లకు తావులేకుండా ఉపాధ్యాయులకు డీఈవో స్థాయిలో గ్రీవెన్స్‌కు అవకాశం కల్పించారు. ఒకవేళ ఎవరైనా తెలియక, తప్పుడు ధృవీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో పెట్టినా, వాటిని వెనక్కి తీసుకునే వెసులుబాటు కల్పించారు. ఇలా 663 మంది దరఖాస్తు చేసుకోగా, వాటిని డీఈవో స్థాయిలో పరిష్కరించారు. అయినప్పటకీ కొంతమంది ఉపాధ్యాయులు గుంబనంగా ఉండిపోయారు. ఇలాంటి వారు తాజాగా వెలుగులోకి రావటంతో, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యల నుంచి తప్పించుకునేలా తమ పేర్లు జాబితా నుంచి తొలగించాలని డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పారదర్శకంగా బదిలీలు



బదిలీలు పారదర్శకంగా జరిపించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎంఈవో, డిప్యూటీ డీఈవో స్థాయిలో దరఖాస్తుల పర్యవేక్షణ జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా కేడర్ వారీగా సీనియార్టీ జాబితాలను సిద్ధం చేశాం. తప్పుడు ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించి వాటిని తొలగించాం. అలాంటి వారిపై ఏ మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలనేది ఉన్నతాధికారులకు నివేదించాం.

– ఎల్ చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

ప్రతిష్టాత్మకంగా జి-20 సదస్సు

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): విశాఖలో మార్చిలో నిర్వహించనున్న జి-20 సదస్సుకు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి వై. శ్రీలక్ష్మి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతిష్టాత్మకంగా జి-20 సదస్సు నిర్వహించాలన్నారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, ఇతర ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో జి-20 సదస్సుపై శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మార్చి 28, 29 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా జరగనున్న జి-20 సదస్సుకు ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా ఏ శాఖకు సంబంధించిన పనులు వారు పూర్తి బాధ్యతతో చేయాలన్నారు. సుమారు 40 దేశాల నుంచి ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో ప్రముఖులు పర్యటించనున్న నేపథ్యంలో అరకు, బొర్రా గుహలు, శిల్పారామం, కైలాసగిరి, ఆర్కే బీచ్, వీఎంఆర్‌డీఏ-స్మార్ట్ సిటీ పార్కు తదితర ప్రాంతాలను ఆధునికీకరించి, అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అతిథులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రొటోకాల్ ప్రకారం వసతి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని, వారికి తగిన భద్రత కల్పించాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, నగర సుందరీకరణ, విద్యుత్, రోడ్ల మరమ్మతు వంటి పనులు జీవీఎంసీ యంత్రాంగం పర్యవేక్షించాలని కమిషనర్‌ను ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఉన్నతాధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, వీఎంఆర్‌డీఏ అధికారులు, డీఆర్డీ అధికారులు, డీఎం అండ్‌హెచ్‌వో, గిరిజన కార్పొరేషన్ అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీవితకాలం పెరుగుదలతో క్యాన్సర్‌కు దోహదం



- 50 ఏళ్లు దాటితే పరీక్షల ద్వారా గుర్తించే అవకాశం
- విలేజ్ క్లినిక్ కాన్సెప్ట్‌తో ఈ రోగులకు ప్రయోజనం
- 'సాక్షి'తో యూఎస్ క్యాన్సర్ నిపుణుడు రఘు కల్లూరి

సాక్షి, విశాఖపట్నం: మనుషుల జీవితకాలం పెరుగుదల క్యాన్సర్ వ్యాధికి దోహదం చేస్తోందని అధ్యయనాల్లో తేలినట్టు అమెరికాలోని క్యాన్సర్ వ్యాధి నిపుణుడు రఘు కల్లూరి తెలిపారు. అందుకే క్యాన్సర్ ఏజింగ్ డిసీజ్‌గా మారుతోందన్నారు. ఏపీపీఐ గ్లోబల్ హెల్త్ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. వైద్యరంగంలో పెరుగుతున్న విజ్ఞానంతో మనిషి సగటు ఆయుష్షును పెంచగలుగుతున్నా, వ్యాధులను తగ్గించలేకపోతున్నామని చెప్పారు. 50 ఏళ్లు దాటిన వారిలో వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లుతుందని, అలాంటి వారికి క్యాన్సర్ సోకే అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. గతంలో మనిషి సగటు జీవితకాలం 50 ఏళ్లే ఉండడంతో దాని బారి నపడే వారి సంఖ్య తక్కువగా ఉండేదని వివరించారు. అందువల్ల 50 ఏళ్లు పైబడిన వారు క్యాన్సర్ లక్షణాలున్నా, లేకపోయినా కొలనోస్కోపీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ పరిస్థితిని ముందుగా గుర్తించే వీలుంటుందన్నారు. ఫలితంగా క్యాన్సర్ తీవ్రతకు అడ్డుకట్ట వేయడం ద్వారా మరణాలను తగ్గించవచ్చని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లు, మితాహారం, మాంసాహారాన్ని తగ్గించడం, పరిశుభ్ర వాతావరణంలో నివశించడం, బరువు తగ్గడం, కాలుష్య ప్రభావానికి దూరంగా ఉండడం క్యాన్సర్ బారినపడకుండా ఉండేందుకు దోహదపడతాయని తెలిపారు.

విలేజ్ క్లినిక్ కాన్సెప్ట్‌తో మేలు

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచడం ద్వారా కూడా క్యాన్సర్ ఉధృతిని తగ్గించవచ్చని డాక్టర్ రఘు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన విలేజ్ క్లినిక్ కాన్సెప్ట్ ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కాన్సెప్ట్‌లో జీవనశైలిలో మార్పులపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇమ్యునోథెరపీ క్యాన్సర్ నిరోధంలో మంచి ఫలితాలిస్తోందని తెలిపారు. దీనికి 30–70 వేల డాలర్ల ఖర్చవుతున్నందున సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదని చెప్పారు.

ఏయూ మైదానంలోనే వాల్తేరు వీరయ్య ప్రీ రిలీజ్



చిరంజీవి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అభిమానులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య చిత్రం ప్రీ రిలీజ్ వేడుకు వేదిక విషయంలో రెండు రోజులుగా నెలకొన్న సందిగ్ధత తొలగిపోయింది. ఏయూ మైదానంలోనే వేడుక నిర్వహించేందుకు పోలీసులు అనుమతులిచ్చారు. ముందు ఆర్కే బీచ్‌లో వేడుకలు నిర్వహించాలని ఏర్పాట్లు చేశారు. అయితే ప్రభుత్వం జీవో నంబర్–1 విడుదల చేయడంతో వేదిక మార్చుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో ఏయూ మైదానంలో వేడుక నిర్వహించేందుకు అనుమతులు ఇవ్వాలని నిర్వాహకులు సీపీ శ్రీకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు పోలీసులు కూడా అనుమతులు మంజూరు చేశారు. అయితే శనివారం ఉదయం తిరిగి ఆర్కేబీచ్‌లో వేడుకలు నిర్వహించేందుకు అనుమతులు వచ్చాయంటూ ఏర్పాట్లు పునఃప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం మూడో పట్టణ సీఐ రామారావు ఆర్కే బీచ్‌కు చేరుకొని అనుమతులు లేకుండా ఏర్పాట్లు ఎలా చేస్తారని, తక్షణం నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో అసలు ప్రీ రిలీజ్ వేడుక ఎక్కడ నిర్వహించాలో తెలియక అటు నిర్వాహకులు, ఇటు అభిమానులు ఆందోళన చెందారు. చివరికి ఏయూ గ్రౌండ్స్‌లోనే ప్రీ రిలీజ్ వేడుకలను నిర్వహించేందుకు పోలీసులు అనుమతులు ఇవ్వడంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

వాల్తేరు వీరయ్యకు క్షీరాభిషేకం

సంక్రాంతికి వాల్తేరు వీరయ్య చిత్రం విడుదల కానుండంతో మెగాస్టార్ చిరంజీవి చిత్ర పటానికి శనివారం సాగరతీరంలో అభిమానులు క్షీరాభిషేకం నిర్వహించారు. వందలాది మంది అభిమానులు తరలివచ్చారు. శనివారం చిత్రం టీజర్ విడుదల చేయడంతో సందడి నెలకొంది.

ముగిసిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇంటిలిజెన్స్ ఏఎస్పీ వెంకటరావు

మురళీనగర్ (విశాఖ ఉత్తర): ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఇంటిలిజెన్స్ ఏఎస్పీ ఎస్.వెంకటరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి చూపాలని ఏఎస్పీ సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తుమ్మిడి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తుమ్మిడి రామ్‌కుమార్, టెక్నికల్ ఎడ్యుకేషన్ పూర్వ జేడీ డాక్టర్ ఎస్‌వీయూఎం ప్రసాద్ పాల్గొన్నారు.

శిక్షాప్రాతిశాఖ్య గ్రంథావిష్కరణ



శిక్షాప్రాతిశాఖ్య గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీవిజయేంద్ర

బీచ్‌రోడ్డు: భద్రాచల దేవస్థాన రామాయణ పారాయణదారులు ఎస్‌టీజీ కృష్ణమాచార్యులు రచించిన చతుర్వేద వేదాల శిక్షా ప్రాతిశాఖ్య గ్రంథాన్ని శనివారం ఆవిష్కరించారు. గ్రంథాన్ని కంచిపీఠాధిపతులు శ్రీవిజయేంద్ర స్వామికి అందజేశారు. భద్రాచలం దేవస్థాన సామావేదపండితులు, ఎమ్మెల్యే గంటా పాల్గొన్నారు.

DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM

31-31-21, Ground & 1st Floor, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, Andhra Pradesh.

Case No: OA No: 551/2022

Summons under sub section (4) of section 19 of the Act, read with sub rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

Union Bank of India, Mid Corporate Branch, Visakhapatnam-530002.

VS

M/s Hai Greeva Infra Tech Projects Ltd, MVP Colony, Visakhapatnam & Others

To:

Defendant-7: Mrs. Tirumalaraju Venkata Subba Lakshmi, D.No: 49-5-3, Lalitha Nagar, Visakhapatnam 530016

Defendant-8: Mr. Dumpa Narasimha Murthy, D.No: 1-91, Bheemunipatnam, Visakhapatnam-531163.

Defendant-9: Mr. Y. Satya Veera Venkata Prasada Rao, D.No: 49-54-9/7, Allipuram Extension Ward, Visakhapatnam - 530013.

Defendant-10: Mrs. Yetcharla Ramanamma, D.No. 49-54-9/7, Allipuram Extension Ward, Visakhapatnam - 530013.

Defendant-12: Mrs. Kolli Sujatha, Plot No: 79, RTC Colony, Contonment, Visakhapatnam 535003

Defendant-16: Mr. Anneparthi Santosh, D.No: 3-5-116, Jammigadda, Suryapet, Suryapet, Nalgonda-508213.

Defendant-18: Mrs. M. Shyamala, D.No. 2-349, Old Dairy Farm, Adarsh Nagar, Visakhapatnam-530040.

Defendant-20: Mr. Prahalad Kumar Rathi, C/o Rathi Salesa Agencies, Ramatalkies Road, Nr Lakshmi Hundai Showroom, Visakhapatnam 530017

Defendant-24: M/s Haigreeva Farm & Developers, D.No. 2-3-49, Krishna Poultries, Old Dairy Farm, Visakhapatnam 530017

Defendant-25: M/s Haigreeva Projects, Dr. No: 1-3, Jodugulla Palem, Visalakshinagar, Visakhapatnam 530043

PAPER PUBLICATION

Whereas, OA 551/2022 was listed before Hon'ble Presiding Officer/Registrar on 24/01/2023.

WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs.98,45,72,965/-** (application along with copies of documents etc. annexed).

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-.

(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted

(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.

(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties

(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal,

(v) you shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer / Registrar on **24/01/2023** at 10.30 A.M. failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this date 26-12-2022

Signature of Officer Authorized to issue PAPER PUBLICATION
Debts Recovery Tribunal, Visakhapatnam

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఆశీల్‌మెట్ట బ్రాంచ్

10-4-18/ఎ, గ్రౌండ్ ఫ్లోర్, విమలా కాంప్లెక్స్, ఆశీల్‌మెట్ట, రామ్‌నగర్, విశాఖపట్నం-530002.
ఫోన్: 0891-2740464, 9182655322, ఇ-మెయిల్ ఐడి: bm1343@unionbankofindia.com

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6)/6(2) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆశీల్‌మెట్ట బ్రాంచ్** వారికి దిగువ పేర్కొన్న ఋణగ్రహీత(లు) / కో-ఆప్లికెంట్స్ / తనఖాదారు(లు) / హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి **రూ.20,75,391.61 (అక్షరములా ఇరవై లక్షల డెబ్బై ఐదు వేల మూడు వందల తొంభై ఒక్క రూపాయల అరవై ఒక్క పైసలు మాత్రమే)** + తేది. 01.05.2021 నుండి కాంట్రాక్చ్యువల్ రేటు ప్రకారం వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలను కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆశీల్‌మెట్ట బ్రాంచ్** అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జ్ చేసిన దిగువ వివరించిన **స్థిరాస్తిని తేది 25.01.2023** న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన ఆన్‌లైన్ వెబ్‌సైట్ **https://www.mstcecommerce.com** ద్వారా అమ్మకం జరుపుటకు నిర్ణయించడమైనదని ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) / కో-అప్లికెంట్స్ / తనఖాదారు(లు) / హామీదారు(లు)కు ఈ నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. **రిజర్వు ధర మరియు ధరావత్తు వివరములు దిగువున పేర్కొనబడినవి.**

1) **ఋణగ్రహీత, కో-అప్లికెంట్స్ మరియు హామీదారుల పేరు మరియు చిరునామా:** (1) మెస్సర్స్ శ్రీ సంజన ఎంటర్‌ప్రైజెస్, డోర్ నెం. 49-3-1, మొదటి అంతస్తు, మారుతీ ఆశ్రమం రోడ్డు, లలితా నగర్, అక్కయ్యపాలెం ఏరియా, విశాఖపట్నం. (2) శ్రీ పి. నాగరాజు, డోర్ నెం. 49-3-1, మొదటి అంతస్తు, మారుతీ ఆశ్రమం రోడ్డు, లలితా నగర్, అక్కయ్యపాలెం ఏరియా, విశాఖపట్నం. (3). శ్రీమతి ఎం. నాగమణి, భర్త: శ్రీ పి. నాగరాజు, డోర్ నెం. 49-3-1, మొదటి అంతస్తు, మారుతీ ఆశ్రమం రోడ్డు, లలితా నగర్, అక్కయ్యపాలెం ఏరియా, విశాఖపట్నం.

2) . **సెక్యూర్డ్ క్రెడిటార్ పేరు మరియు చిరునామా:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆశీల్‌మెట్ట బ్రాంచి, ఆశీల్‌మెట్ట, విశాఖపట్నం, ఫోన్ నెం. 0891-2740464, 91826 55322, ఇ-మెయిల్: bm1343@unionbankofindia.com

3) సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన ఎన్‌కంబ్రెన్స్ వివరాలు	ఏమీ లేవు
4) ధరావత్తు చెల్లించడానికి ఆఖరు తేదీ	24.01.2023, సా॥ 4.00 గం॥లకు
5) వేలం తేదీ మరియు సమయం	25.01.2023, ఉ॥ 11.00 గం॥ల నుండి 5.00 గం॥ వరకు (10 ని॥ల అపరిమిత పొడిగింపుతో), ఇ-ఆక్షన్ వెబ్‌సైట్: www.mstcecommerce.com
6) రికవరీ కొరకు సెక్యూర్డ్ డెబ్ట్ యొక్క స్థిరమైన సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించాలి	రూ. 20,75,391.61 పై॥ (అక్షరములా ఇరవై లక్షల డెబ్బై ఐదు వేల మూడు వందల తొంభై ఒక్క రూపాయల అరవై ఒక్క పైసలు మాత్రమే) + తేది. 01.05.2021 నుండి కాంట్రాక్చ్యువల్ రేటు ప్రకారం వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు: ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం, జివిఎంసి లిమిట్స్, లక్ష్మీపురం గ్రామం, (సుజాతనగర్ దగ్గర), గొల్లవిల్లివాని పాలెం, సర్వే నెం. 93/1, మొత్తం 1029 చదరపు గజాలలో 28.52 చదరపు గజాల అవిభాజ్యపు మరియు అనిర్దేశ స్థలంతో "రాఘవేంద్ర రెసిడెన్సీ" నాలుగవ అంతస్తులోని కామన్ ఏరియాలతో కలిపి **1150 చదరపు అడుగులు కలిగిన**, డోర్ నెం. 8-101-32 కలిగిన **ఫ్లాట్ నెం. 404** పొలకిర్తి నాగరాజు గారికి చెందినది. **నాలుగవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 404కు హద్దులు:** తూర్పు: ఫ్లాట్ నెం.403, దక్షిణం: ఈ అపార్ట్‌మెంట్‌కు చెందిన ఖాళీ ప్రదేశం, పడమర: ఈ అపార్ట్‌మెంట్‌కు చెందిన ఖాళీ ప్రదేశం, ఉత్తరం: కారిడార్ మరియు ఫ్లాట్ నెం. 405.

రిజర్వు ధర: రూ. 27,33,000/- **ధరావత్తు: రూ. 2,73,300/-**

బిడ్డరు ఇ-వేలం అమ్మకమునకు సంబంధించిన నియమ నిబంధనల కొరకు మరియు ఇతర వివరములు కొరకు ఇ-వేలంలో పాల్గొనడానికి తమ బిడ్లు దాఖలు చేసే ముందు బ్యాంక్ వెబ్‌సైట్ : **www.unionbankofindia.co.in** చూడవలసినదిగా కోరడమైనది. బిడ్డర్ వారి మొబైల్ నెం. మరియు ఇ-మెయిల్ ఐడిని ఉపయోగించి **https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp** సందర్శించవచ్చు. వారు KYC పత్రాలు మరియు బ్యాంక్ వివరాలను అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది.

ఆసక్తి గల బిడ్డర్లు పై వివరములు తెలుసుకొనేందుకు ఆస్తి తనిఖీ కొరకు అధీకృత అధికారి, **ఆశీల్‌మెట్ట బ్రాంచి, విశాఖపట్నం ఫోన్: 0891-2740464, 9182655322**, ఇ-మెయిల్: **bm1343@unionbankofindia.com** ద్వారా బ్యాంక్ పనిదినములలో సంప్రదించగలరు.

తేది: 05.01.2023, స్థలం: విశాఖపట్నం — సం/-అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పీవీ చలపతిరావు విగ్రహం ఏర్పాటు చేయాలి

సంస్మరణ సభలో జీవీఎల్



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీవీఎల్ తదితరులు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): కార్యదక్షతకు నిలువెత్తు నిదర్శనం బీజేపీ సీనియర్ నాయకుడు పీవీ చలపతిరావు అని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. చలపతిరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. శనివారం బీజేపీ నగర కార్యాలయంలో చలపతిరావు సంస్మరణ సభను పార్టీ నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పీవీ చలపతిరావు విగ్రహాన్ని బీచ్‌రోడ్డులో ప్రభుత్వంఏర్పాటు చేయాలని జీవీఎల్ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, సీనియర్ నాయకులు ఎన్.గజపతిరావు, పృథ్వీరాజ్, విశ్వహిందూ పరిషత్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.70.12 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం లెక్కింపు శనివారం చేపట్టారు. రూ.70,12,294, 141 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 2 కేజీల 450 గ్రాముల 200 మిల్లీగ్రాముల వెండి వచ్చింది. అలాగే 169 యూఎస్‌ఏ డాలర్లు, యూరోపియన్ యూనియన్‌కు చెందిన 5 యూరోలు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన 20 పౌండ్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ జోర్డాన్‌కు చెందిన 1 దినర్ వచ్చింది. హుండీ ఆదాయం లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్య రూపవాణి, ధనలత, అనురాధ, ఎస్‌ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, అనకాపల్లి, మునగపాక గ్రూప్ టెంపుల్స్ గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారి పి సత్యనారాయణమూర్తి, గోపాలపట్నం శ్రీహరి సేవా సభ్యులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏఓ కె సురేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాకమర్రి ప్లాట్ల కేటాయింపులు



లాటరీ తీస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

దొండపర్తి(విశాఖ దక్షిణ): భీమిలి మండలంలో దాకమర్రి ఫార్చ్యూన్ హిల్స్ లేఅవుట్‌లో ప్లాట్లకు వీఎంఆర్‌డీఏ అధికారులు లాటరీ నిర్వహించి దరఖాస్తుదారులకు కేటాయింపులు చేశారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సంస్థ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ప్రారంభించి లాటరీ ద్వారా 150 ఎల్‌ఐజీ ప్లాట్ల కేటాయింపులు చేపట్టారు. ఇందులో ప్లాట్లు దక్కించుకున్న వారికి వెంటనే అలాట్‌మెంట్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ కార్యదర్శి టి.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు గజం ధర రూ.9 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. వీటిని దక్కించుకున్న వారు మూడు పనిదినాల్లో ప్లాట్ ధరలో 10 శాతం చెల్లింపులు తప్పనిసరిగా చేయాలని సూచించారు. మిగిలిన 90 చెల్లింపులు మూడు సులభ వాయిదాల్లో (ప్రతి రెండు నెలలకు ఒక వాయిదా చొప్పున) చెల్లించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. అలాగే ఈ కేటాయింపుదారుల వివరాలను వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్‌లోను, కార్యాలయం నోటీస్ బోర్డులో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ లాటరీలో కేటాయింపులు జరగని 118 దరఖాస్తుదారులకు ఈఎండీ సొమ్మును వెనక్కు ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన వారు కార్యాలయం 8వ అంతస్తులో అలాట్‌మెంట్ సెక్షన్‌లో ఆధార్, టోకెన్ నెంబర్‌తో వచ్చి చెక్కు రూపంలో డబ్బును పొందవచ్చన్నారు. రిజర్వ్‌డ్ కేటగిరీ వారికి 15 రోజుల్లో ఈఎండీ చెల్లింపులు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అర్బన్ ప్లానర్ ప్రభాకర్, ఎస్టేట్ భవానిశంకర్, అకౌంట్స్ ఆఫీసర్ నిర్మలమ్మ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
విశాఖపట్నం-3 బ్రాంచ్, 29-2-35, జిల్లా కోర్టు ఎదురుగా,

విశాఖపట్నం. ఫోన్: 0891-2567558, ఇ-మెయిల్: ubin0532894@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం-3 బ్రాంచ్** వారికి దిగువ పేర్కొన్న ఋణగ్రహీత(లు) / కో-అప్లికెంట్స్ / తనఖాదారు(లు) / హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి **రూ. 5,21,734.61/- (అక్షరాల ఐదు లక్షల ఇరవై ఒక్క వేల ఏడు వందల ముప్పై నాలుగు రూపాయలు మరియు అరవై ఒకటి పైసలు)** + కాంట్రాక్చ్యువల్ రేటు ప్రకారం తేది. 01.06.2022 నుండి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం-3 బ్రాంచ్** అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జ్ చేసిన దిగువ వివరించిన **స్థిరాస్తిని తేది 25.01.2023** న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన ఆన్‌లైన్ వెబ్‌సైట్ **https://www.mstcecommerce.com** ద్వారా అమ్మకం జరుపుటకు నిర్ణయించడమైనదని ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) / కో-అప్లికెంట్స్ / తనఖాదారు(లు) / హామీదారు(లు)కు ఈ నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. రిజర్వు ధర మరియు ధరావత్తు వివరములు దిగువున పేర్కొనబడినవి.

1) **ఋణగ్రహీత, కో-అప్లికెంట్స్ మరియు హామీదారుల పేరు మరియు చిరునామా:** 1. శ్రీమతి భోగవరపు కుమారి, ఎల్ఐజి-33, సెక్టార్-6, ఎమ్‌వివి కాలనీ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-17, 2. శ్రీ భోగవరపు కె.వి.ఆ ప్రసాద్, ఎల్ఐజి-33, సెక్టార్-6, ఎమ్‌వివి కాలనీ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-17.

2) **సెక్యూర్డ్ క్రెడిటార్ పేరు మరియు చిరునామా:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం-3 బ్రాంచ్, 29-2-35, జిల్లా కోర్టు ఎదురుగా, విశాఖపట్నం. ఫోన్: 0891-2567558, 9564734771. ఇ-మెయిల్ ఐడి: ubin0532894@unionbankofindia.bank

3) **అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు:** విశాఖపట్నం జిల్లా, ఆనందపురం సబ్-రిజిస్ట్రేషన్ ఆఫీసు, ఆనందపురం మండలం, గిడిజాల గ్రామ పంచాయితీ, మదుర వేమ గొట్టి పాలెం, ఎస్.నెం 4/పి, 5/పి, 7/పి & 8/పి, ప్లాట్ నెం.126 & 127, ఎల్.పి. నెం. 48/2012, "సువర్ణ కుటీర్" ఫేజ్ III, బి-బ్లాక్ నందు 180 చ॥గ॥ రెసిడెన్షియల్ ఖాళీ స్థలం. స్థలానికి హద్దులు: తూర్పు: 30 అ॥ వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్రహారీ గోడ, పడమర: ప్లాట్ నెం. 100 & 101, ఉత్తరం: ప్లాట్ నెం. 125.

4) సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన ఎన్‌కంబ్రెన్స్ వివరాలు	ఏమీ లేవు
5) ధరావత్తు చెల్లించడానికి ఆఖరు తేది	24-01-2023, సా॥ 4.00 గం॥ లోపు
6) వేలం తేది మరియు సమయం	25-01-2023, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ వరకు (10 ని॥ల అపరిమిత పొడిగింపుతో), ఇ-ఆక్షన్ వెబ్‌సైట్: www.mstcecommerce.com
7) రికవరీ కొరకు సెక్యూర్డ్ డెట్ యొక్క స్థిరమైన సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించాలి	రూ. 5,21,734.61/- (అక్షరాల ఐదు లక్షల ఇరవై ఒక్క వేల ఏడు వందల ముప్పై నాలుగు రూపాయలు మరియు అరవై ఒక్క పైసలు) + కాంట్రాక్చ్యువల్ రేటు ప్రకారం తేది. 01.06.2022 నుండి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
8.1) రిజర్వు ధర కన్నా తక్కువ ధరకు ఆస్తి అమ్మబడదు	రూ.16,20,000/- (అక్షరాల పదహారు లక్షల ఇరవై వేల రూపాయలు)
8.2) చెల్లించవలసిన ధరావత్తు సొమ్ము	రూ.1,62,000/- (అక్షరాల ఒక లక్షా అరవై రెండు వేల రూపాయలు)

బిడ్డరు ఇ-వేలం అమ్మకమునకు సంబంధించిన నియమ నిబంధనల కొరకు మరియు ఇతర వివరములు కొరకు ఇ-వేలంలో పాల్గొనడానికి తమ బిడ్లు దాఖలు చేసే ముందు బ్యాంక్ వెబ్‌సైట్ : **www.unionbankofindia.co.in** చూడవలసినదిగా కోరడమైనది. బిడ్డర్ వారి మొబైల్ నెం. మరియు ఇ-మెయిల్ ఐడిని ఉపయోగించి **https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp** సందర్శించవచ్చు. వారు KYC పత్రాలు మరియు బ్యాంక్ వివరాలను అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది.

ఆసక్తి గల బిడ్డర్లు పై వివరములు తెలుసుకొనేందుకు, ఆస్తి తనిఖీ కొరకు అధీకృత అధికారి, విశాఖపట్నం-3 బ్రాంచ్, ఫోన్:0891-2567558, 9564734771, ఇ-మెయిల్ ఐడి: **ubin0532894@unionbankofindia.bank** ద్వారా బ్యాంక్ పనిదినములలో సంప్రదించగలరు.

తేది: 05.01.2023, స్థలం: విశాఖపట్నం — సం/-అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గోపాలపట్నం బ్రాంచ్, 9-333-1, 1వ అంతస్తు, మెయిన్ రోడ్డు,

గోపాలపట్నం, విశాఖపట్నం. ☎ 0891-2520739. Email: gopalapatnam@unionbankofindia.com

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోపాలపట్నం బ్రాంచ్** వారికి దిగువ పేర్కొన్న ఋణగ్రహీతలు /కో-అప్లికెంట్స్ / హామీదారులు చెల్లించవలసిన బకాయి **రూ.6,61,332.66 (అక్షరాల ఆరు లక్షల అరవై ఒక్క వేల మూడు వందల ముప్పై రెండు రూపాయలు మరియు అరవై ఆరు పైసలు)** + తేది. 31.01.2020 నుండి కాంట్రాక్చ్యువల్ రేటు ప్రకారం వడ్డీ మరియు ఇతర ఖర్చులు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోపాలపట్నం బ్రాంచ్** అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జ్ చేసిన దిగువ వివరించిన **స్థిరాస్తిని తేది 25.01.2023** న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన ఆన్‌లైన్ వెబ్‌సైట్ **https://www.mstcecommerce.com** ద్వారా అమ్మకం జరుపుటకు నిర్ణయించడమైనదని ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతకు ఈ నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. **రిజర్వు ధర మరియు ధరావత్తు వివరములు దిగువ పేర్కొనబడినవి.**

1. **ఋణగ్రహీత, కో-అప్లికెంట్స్ మరియు హామీదారుల పేరు మరియు చిరునామా:** (1). M/s పద్మావతి ఎంటర్‌ప్రైజెస్, E 105, పంచవటి టౌన్‌షిప్, అక్కిరెడ్డిపాలెం, బిహెచ్‌పివి పోస్టు, విశాఖపట్నం-530012, (2). శ్రీమతి పొన్నగంటి శిల్ప, భర్త: లేటు పొన్నగంటి శివ నాగరాజు, E 105, పంచవటి టౌన్‌షిప్, అక్కిరెడ్డిపాలెం, బిహెచ్‌పివి పోస్టు, విశాఖపట్నం-530012, (3). మాస్టర్ పొన్నగంటి ఓం సాయిరామ్, తండ్రి: లేటు పొన్నగంటి శివ నాగరాజు, E 105, పంచవటి టౌన్‌షిప్, అక్కిరెడ్డిపాలెం, బిహెచ్‌పివి పోస్టు, విశాఖపట్నం-530012. 4. శ్రీ పొన్నగంటి శరాన్య, తండ్రి: లేటు పొన్నగంటి శివ నాగరాజు, E 105, పంచవటి టౌన్‌షిప్, అక్కిరెడ్డిపాలెం, బిహెచ్‌పివి పోస్టు, విశాఖపట్నం-530012.

సెక్యూర్డ్ క్రెడిటార్ పేరు మరియు చిరునామా: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోపాలపట్నం బ్రాంచ్, 9-333-1, 1వ అంతస్తు, మెయిన్ రోడ్డు, శంకర థియేటర్ దగ్గర, గోపాలపట్నం, విశాఖపట్నం -530027.

3. **అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు:** ఐటమ్-ఎ: విశాఖపట్నం, గాజువాక, తుంగ్లం, కుమిలినగర్ లే-అవుట్, షీలా నగర్, ఎస్.నెం. 71/2బి2, ప్లాట్ నెం. 172 నందు పొన్నగంటి శివ నాగరాజు, తండ్రి: వెంకట సుబ్బారావు పేరునగల **212.50 చ॥గ॥ ఖాళీ రెసిడెన్షియల్ స్థలం. హద్దులు:** తూర్పు: ప్లాట్ నెం. 173, దక్షిణం: 40 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 172 భాగం నందు 212.50 చ॥గ॥ విస్తీర్ణం, ఉత్తరం: ప్లాట్ నెం. 159. **ఐటమ్-బి:** విశాఖపట్నం, గాజువాక, తుంగ్లం, షీలా నగర్, కుమిలినగర్ లే-అవుట్, ఎస్.నెం. 71/2బి2పి, ప్లాట్ నెం. 172 నందు పొన్నగంటి శివ నాగరాజు, తండ్రి: వెంకట సుబ్బారావు పేరునగల **212.50 చ॥గ॥ ఖాళీ రెసిడెన్షియల్ స్థలం. హద్దులు:** తూర్పు: ప్లాట్ నెం. 172, దక్షిణం: 40 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 172 భాగం యొక్క 212.50 చ॥గ॥ విస్తీర్ణం, ఉత్తరం: ప్లాట్ నెం. 159.

4.	సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన ఎన్‌కంబ్రెన్స్ వివరాలు:	ఏమీ లేవు
5.	ధరావత్తు చెల్లించడానికి ఆఖరు తేదీ	24.01.2023, సా॥ 4.00 గం॥ వరకు
6.	వేలం తేదీ మరియు సమయం	25.01.2023, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ వరకు (10 ని॥ అపరిమిత పొడిగింపుతో), ఇ-ఆక్షన్ వెబ్‌సైట్: www.mstcecommerce.com
7.	రికవరీ కొరకు సెక్యూర్డ్ డెబ్ట్ యొక్క స్థిరమైన సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించాలి	రూ.6,61,332.66 (అక్షరాల ఆరు లక్షల అరవై ఒక్క వేల మూడు వందల ముప్పై రెండు రూపాయలు మరియు అరవై ఆరు పైసలు) + తేది. 31.01.2020 నుండి కాంట్రాక్చ్యువల్ రేటు ప్రకారం వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
8.	1) రిజర్వు ధర కన్నా తక్కువ ధరకు ఆస్తి అమ్మబడదు	రూ.68,00,000/- (అక్షరాల అరవై ఎనిమిది లక్షల రూపాయలు)
8.	2) చెల్లించవలసిన ధరావత్తు సొమ్ము	రూ.6,80,000/- (అక్షరాల ఆరు లక్షల ఎనభై వేల రూపాయలు)

బిడ్డరు ఇ-వేలం అమ్మకమునకు సంబంధించిన నియమ నిబంధనల కొరకు మరియు ఇతర వివరములు కొరకు ఇ-వేలంలో పాల్గొనడానికి తమ బిడ్లు దాఖలు చేసే ముందు బ్యాంక్ వెబ్‌సైట్ : **www.unionbankofindia.co.in** చూడవలసినదిగా కోరడమైనది. బిడ్డర్ వారి మొబైల్ నెం. మరియు ఇ-మెయిల్ ఐడిని ఉపయోగించి **https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp** సందర్శించవచ్చు. వారు KYC పత్రాలు మరియు బ్యాంక్ వివరాలను అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది.

ఆసక్తి గల బిడ్డర్లు పై వివరములు తెలుసుకొనేందుకు ఆస్తి తనిఖీ కొరకు బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోపాలపట్నం బ్రాంచ్, ఫోన్: 0891-2520739, 80991 94004, ఇ-మెయిల్ ఐడి: **gopalapatnam@unionbankofindia.com** ద్వారా బ్యాంక్ పనిదినములలో సంప్రదించగలరు.

తేది: 05.01.2023, స్థలం: విశాఖపట్నం — సం/-అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఈస్ట్ పాయింట్ కాలనీ బ్రాంచ్, 8-23-1, ఈస్ట్ పాయింట్ కాలనీ,

విశాఖపట్నం. ☎ 0891-2546759, 7382965073. Email: ubin0813320@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈస్ట్ పాయింట్ కాలనీ బ్రాంచ్** వారికి దిగువ పేర్కొన్న ఋణగ్రహీతలు /కో-అప్లికెంట్స్ / హామీదారులు చెల్లించవలసిన బకాయి **రూ.10,33,181.04 (అక్షరాల పది లక్షల ముప్పై మూడు వేల నూట ఎనభై ఒకటి రూపాయలు మరియు నాలుగు పైసలు)** + తేది. 30.04.2021 నుండి కాంట్రాక్చ్యువల్ రేటు ప్రకారం వడ్డీ మరియు ఇతర ఖర్చులు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈస్ట్ పాయింట్ కాలనీ బ్రాంచ్** అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జ్ చేసిన దిగువ వివరించిన **స్థిరాస్తిని తేది 25.01.2023** న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన ఆన్‌లైన్ వెబ్‌సైట్ **https://www.mstcecommerce.com** ద్వారా అమ్మకం జరుపుటకు నిర్ణయించడమైనదని ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతకు ఈ నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. **రిజర్వు ధర మరియు ధరావత్తు వివరములు దిగువ పేర్కొనబడినవి.**

1. **ఋణగ్రహీత, కో-అప్లికెంట్స్ మరియు హామీదారుల పేరు మరియు చిరునామా:** (1). బాలబొమ్మల సుధా జ్యోతి, ఫ్లాట్ నెం. ఎఫ్2, 1వ అంతస్తు, విజయ ఆర్కేడ్, డి.నెం.28-10/4, వేపగుంట, విశాఖపట్నం-530047. (2). బాలబొమ్మల భాస్కర్ రావు, ఫ్లాట్ నెం. ఎఫ్2, 1వ అంతస్తు, విజయ ఆర్కేడ్, డి.నెం.28-10/4, వేపగుంట, విశాఖపట్నం-530047.

2. **సెక్యూర్డ్ క్రెడిటార్ పేరు మరియు చిరునామా:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈస్ట్ పాయింట్ కాలనీ బ్రాంచ్, 8-23-1, ఈస్ట్ పాయింట్ కాలనీ, విశాఖపట్నం. ఫోన్: 0891-2546759, మొబైల్ నెం: 7382965073.

3. **అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు:** విశాఖపట్నం, జి.వి.ఎమ్.సి, వేపగుంట గ్రామం, ఎల్.ఆర్.సి ఫీల్డ్ స్కెచ్ ప్రకారం సర్వే నెంలు. 5, 7, బిహెచ్‌పివి టీచర్స్ లేఅవుట్, సర్వేనెం. 5 నందు 267 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు స్థలం 30 చ॥గ॥ లేదా 25.083 చ॥మీ॥ వాటాతో అందులోని మొత్తం విస్తీర్ణంలో నిర్మించిన విజయ ఆర్కేడ్ మొదటి అంతస్తులో 780 చ॥అ॥ ప్లింత్ ఏరియా, డోర్ నెం. 28-10/4, అసెస్‌మెంట్ నెం. 100010/08453 కలిగిన రెసిడెన్షియల్ యూనిట్ ఫ్లాట్ నెం. ఎఫ్2. **స్థలానికి హద్దులు:** తూర్పు: ప్లాట్ నెం. 190, దక్షిణం: ప్లాట్ నెం. 184, పడమర: 40 అ॥ వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం. 182. **1వ అంతస్తులోని ఫ్లాట్ నెం.ఎఫ్-2 కు హద్దులు:** తూర్పు: ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్, దక్షిణం: ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్, పడమర: ఉమ్మడి మెట్లు మరియు ఫ్లాట్ నెం.ఎఫ్1 & ఎఫ్3, ఉత్తరం: ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్.

4.	సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన ఎన్‌కంబ్రెన్స్ వివరాలు:	ఏమీ లేవు
5.	ధరావత్తు చెల్లించడానికి ఆఖరు తేదీ	24.01.2023, సా॥ 4.00 గం॥ వరకు
6.	వేలం తేదీ మరియు సమయం	25.01.2023, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ వరకు (10 ని॥ అపరిమిత పొడిగింపుతో), ఇ-ఆక్షన్ వెబ్‌సైట్: www.mstcecommerce.com
7.	రికవరీ కొరకు సెక్యూర్డ్ డెబ్ట్ యొక్క స్థిరమైన సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించాలి	రూ.10,33,181.04 (అక్షరాల పది లక్షల ముప్పై మూడు వేల నూట ఎనభై ఒకటి రూపాయలు మరియు నాలుగు పైసలు) + తేది. 30.04.2021 నుండి కాంట్రాక్చ్యువల్ రేటు ప్రకారం వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
8.	1) రిజర్వు ధర కన్నా తక్కువ ధరకు ఆస్తి అమ్మబడదు	రూ.18,95,000/- (అక్షరాల పద్దెనిమిది లక్షల తొంభై ఐదు వేల రూపాయలు)
8.	2) చెల్లించవలసిన ధరావత్తు సొమ్ము	రూ.1,89,500/- (అక్షరాల ఒక లక్షా ఎనభై తొమ్మిది వేల ఐదు వందల రూపాయలు)

బిడ్డరు ఇ-వేలం అమ్మకమునకు సంబంధించిన నియమ నిబంధనల కొరకు మరియు ఇతర వివరములు కొరకు ఇ-వేలంలో పాల్గొనడానికి తమ బిడ్లు దాఖలు చేసే ముందు బ్యాంక్ వెబ్‌సైట్ : **www.unionbankofindia.co.in** చూడవలసినదిగా కోరడమైనది. బిడ్డర్ వారి మొబైల్ నెం. మరియు ఇ-మెయిల్ ఐడిని ఉపయోగించి **https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp** సందర్శించవచ్చు. వారు KYC పత్రాలు మరియు బ్యాంక్ వివరాలను అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది.

ఆసక్తి గల బిడ్డర్లు పై వివరములు తెలుసుకొనేందుకు ఆస్తి తనిఖీ కొరకు బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈస్ట్ పాయింట్ కాలనీ బ్రాంచ్, ఫోన్: 0891-2546759, 7382965073, ఇ-మెయిల్: **ubin0813320@unionbankofindia.bank** ద్వారా బ్యాంక్ పనిదినములలో సంప్రదించగలరు.

తేది: 05.01.2023, స్థలం: విశాఖపట్నం — సం/-అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రక్షకులు

రాత్రి 11 గంటలు.. హలో 108.. అగనంపూడి నుంచి మాట్లాడుతున్నా.. మా అమ్మాయి గర్భిణి.. నెలలు నిండాయి. బిడ్డకు పేగులు చుట్టుకున్నాయి. మాకేం చేయాలో అర్థం కావడం లేదు. వెంటనే రాగలరా?

అర్ధరాత్రి 2 గంటలు.. హలో 108.. అక్కయ్యపాలెం నుంచి మాట్లాడుతున్నాం.. మా అబ్బాయి పురుగు మందు తాగి ఆత్మ హత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లకపోతే ప్రాణం నిలవదు.. అర్జెంట్‌గా వస్తారా?

ఉదయం 7 గంటలు.. చెన్నై–హౌరా మెయిల్ నుంచి మాట్లాడుతున్నా.. ఓ వ్యక్తి రైలు నుంచి దూకేశాడు. కరెక్ట్ ప్లేస్ తెలియదు. మర్రిపాలెం స్టేషన్ అనుకుంటా..

ఉదయం 8.30 గంటలు.. ఆనంద పురం సాధుమఠం వద్ద ఓ లారీని ట్రావెల్ వ్యాన్ డ్రైవర్ ఢీకొన్నాడు. అతను అయ్యప్ప స్వామి. రెండు కాళ్లు పూర్తిగా తెగిపోయి.. క్యాబిన్‌లో చిక్కుకుపోయి ఉన్నాడు. రక్తం విపరీతంగా కారుతోంది..

సాయంత్రం 5 గంటలు.. ఎంవీపీలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు ప్రమాదంలో చిక్కుకున్నారు. తొందరగా రండి.

ఇవేనా.. ఇలాంటివి రోజుకు లెక్కలేనన్ని ఫోన్లు.. హృదయవిదారక ఘటనలు.. ఎక్కడ ఎవరికి ఏ ఆపదొచ్చినా వెంటనే ఫోన్ వెళ్లేది 108కు.. క్షణాల్లోనే కుయ్.. కుయ్ అంటూ సంఘటన స్థలానికి చేరుకుంటుంది. క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చి వారి ప్రాణాలు కాపాడుతుంది. అయితే అందులో పనిచేసే ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్), పైలట్(డ్రైవర్)ది కీలకపాత్ర. కొన ఊపిరితో కొట్టుమిట్టాడే వారికి వైద్య సేవలందిస్తూ, మెరుగైన వైద్యం కోసం మెరుపు వేగంతో ఆస్పత్రికి చేర్చడంలో వారికి వారే సాటి. ఎలాంటి విపత్తులు ఎదురైనా, తమ ప్రాణాలను ఫణంగా పెట్టి, ఆపదలో ఉన్న వారి ప్రాణరక్షణే పరమావధిగా వీరు విధులు నిర్వర్తిస్తున్నారు. రోగుల పాలిట ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు. విధి నిర్వహణలో ఎన్నో కేసులు చూసిన వీరు.. సాహసం, తెగువ చూపించి కాపాడిన కొన్ని కేసుల గురించి 'సాక్షి'తో పంచుకున్నారు.

– విశాఖపట్నం డెస్క్





ఓ కేసులో 108లోనే డెలివరీ చేసిన ఈఎంటీ శైలజ(ఫైల్)

బిడ్డ బయటకు వచ్చేస్తోంది.. ఆస్పత్రికి తరలించే సమయమూ లేదు



కోవిడ్‌కు ముందు అనుకుంటా.. ఓ రోజు అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో ఫోన్‌కాల్ వచ్చింది. అల్లిపురం–రైల్వేస్టేషన్ రోడ్డు(బౌడోరా రోడ్డు)లోని ఓ లాడ్జి ముందు వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఓ ముసలాయన 108కు ఫోన్ చేసి.. ఓ గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతోందని తెలిపాడు. ఆయనకు ఆమె ఎవరో తెలియదు. ఓ వైపు జోరున వర్షం కురుస్తోంది. రోడ్డు మొత్తం అప్పటికే పూర్తిగా నీటితో నిండిపోయింది. ఫోన్ రాగానే వెంటనే అక్కడ బయలుదేరాం. ఫలానా రోడ్డు అని ఆ పెద్దాయన చెప్పారు గానీ.. కచ్చితమైన అడ్రస్ చెప్పకపోవడంతో వర్షంలోనే ఆమె కోసం వెతికాం. అలా ముందుకు సాగుతుంటే ఓ చోట వర్షంలోనే ఆమె మోకాలు లోతు నీటిలో నిల్చొని ఉంది. చూస్తే అంధురాలు. విపరీతమైన నొప్పులతో బాధపడుతోంది. బ్లీడింగ్ అయిపోతోంది. పక్కనే భర్త ఉన్నాడు. ఆయన కూడా అంధుడే. వీరు ఇరువురు రైల్వేస్టేషన్ ముందు బిచ్చమెత్తుకుంటూ ఉంటారు. ఆమె పరిస్థితి చూస్తే చాలా సీరియస్‌గా ఉంది. అక్కడి నుంచి ఆస్పత్రికి తరలించే సమయం కూడా లేదు. బిడ్డ బయటకు వచ్చేస్తోంది. వెంటనే నేను మా పైలట్ ఆమెకు డెలివరీ చేయాలని డిసైడ్ అయ్యాం. పెద్దాయన ఓ బల్ల ఏర్పాటు చేశారు. వర్షంలోనే ఎక్విప్‌మెంట్ తీసుకెళ్లి ఆమెకు డెలివరీ చేశాం. తల్లీబిడ్డ క్షేమం. తరువాత వారిని కేజీహెచ్‌కు తీసుకెళ్లాం. చాలా సంతోషం అనిపించింది. ఆస్పత్రిలో చేర్చిన తర్వాత కూడా తల్లీబిడ్డ ఆరోగ్యంపై ఆరా తీశాను. నేను చదివింది ఎమ్మెస్సీ(హ్యూమన్ జెనెటిక్స్), బీఈడీ. ఇంత చదువుకుని మీరెందుకు 108లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారని అందరూ అడుగుతుంటారు. ఇద్దరు పిల్లలు ఉన్న మహిళకు రాత్రి వేళ ఉద్యోగం ఏంటని ప్రశ్నిస్తుంటారు. దేవుడెందుకు ఇటువైపు పంపించాడో ఇటువంటి కేసులు ఎదురైనప్పుడు అర్థం అవుతుంది. ప్రాణం కాపాడిన సమయంలో బాధితుల కళ్లలో కనిపించే ఆనందం ఎంతటి కష్టాన్నైనా మరిపించేస్తుంది. వచ్చిన కేసుల్లో అన్ని సీరియస్ ఉండవు. ఒకటో రెండో కేసుల్లో మన అవసరం కచ్చితంగా ఉంటుంది. ఆ సమయంలో మనం చూపించే తెగువ ప్రాణాలను నిలబెడుతుంది. ఏదో సందర్భంలో వారు ఎదురైనప్పుడు ఫలానా రోజు మీరు మమ్మల్ని కాపాడారు. మీరు లేకపోతే ఈ రోజు ఇలా మాట్లాడేవాళ్లం కాదని చెబుతుంటారు. ఆ సమయంలో నా కళ్లు చెమ్మగిల్లుతాయి.

– పల్లికొండ శైలజ, ఈఎంటీ, కంచరపాలెం



బాలుడిని 108 వద్దకు తీసుకెళ్తున్న పైలట్ అలీ(ఫైల్)

గ్యాస్ పీల్చి.. స్పృహ కోల్పోతుంటే..?



2020 మే 6. ఆ రోజు రాత్రి విధులకు హాజరయ్యా.. ఫోన్ తర్వాత ఫోన్.. దాదాపు తొమ్మిదిమంది కరోనా రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లా.. అప్పటికే నేను, మా ఈఎంటీ సురేష్ బాగా అలసిపోయాం. 2020 మే 7. విశాఖ చరిత్రలోనే అత్యంత విషాదకర సంఘటన జరిగిన రోజు. తెల్లవారుజాము 3 గంటల సమయం అనుకుంటా.. ఫోన్ వచ్చింది. ఆర్.ఆర్.వెంకటాపురంలోని ఎల్జీ పాలిమర్స్‌లో గ్యాస్ లీకేజీ జరిగింది. వెంటనే అక్కడకు చేరుకోవాలని అసైన్ చేశారు. ఆ సమయంలో నేను ఫోర్త్‌టౌన్ పరిధిలో పనిచేస్తున్నా.. వాహనానికి వెంటనే శానిటైజ్ చేసి సంఘటన స్థలానికి చేరుకున్నాం.. రహదారులు, ఇళ్లల్లో పెద్దలు, పిల్లలు స్పృహ కోల్పోయి పడి ఉన్నారు. నోటి నుంచి నురగలు వస్తున్నాయి. మొదటి ట్రిప్‌లో ఆరుగురు పెద్ద వారిని కేజీహెచ్ ఎమర్జెన్సీ వార్డులో చేర్పించాం. ఉదయం 5.15 నుంచి 5.30 మధ్యలో మళ్లీ వెంకటాపురం చేరుకున్నాం. రోడ్ల పక్కన.. గెడ్డల గట్లుపైన.. చిన్న పిల్లలు అచేతనంగా పడి ఉన్నారు. వారి తల్లిదండ్రులు ఎక్కడ ఉన్నారో తెలియదు. పిల్లల్లో చాలా మందికి స్పృహ లేదు. కొందరు కాస్త స్పృహ ఉన్నా.. మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు. గ్యాస్ పీల్చిన నాకు కళ్లు తిరుగుతున్నాయి. అయినా కనిపించిన పిల్లాడిని ఎత్తుకుని వాహనంలో ఎక్కించా. ఈఎంటీ ఆక్సిజన్ అందించే ప్రయత్నం చేశారు. అలా 14 మంది పిల్లలను వాహనంలో ఎక్కించి బండి స్టార్ట్ చేశాను. గోపాలపట్నం ఆర్చ్ వద్దకు వచ్చే సరికి ఇంకా నేను డ్రైవ్ చేయలేక పక్కనే బండిని నిలిపివేశా.. వెంటనే ఈఎంటీ వచ్చి ముఖం, తలపై నీరు కొట్టి.. నీరు తాగించే సరికి ఐదు నిమిషాల్లో కాస్త కోలుకున్నా.. మళ్లీ మా ప్రయాణం మొదలైంది. బయట గాలి పీల్చి ముగ్గురు పిల్లలు బండిలోనే కోలుకున్నారు. మరికొందరికి ఆక్సిజన్ ఇచ్చే ప్రయత్నం చేశాం. అనంతరం అందరినీ కేజీహెచ్‌లోని పిల్లల వార్డులో చేర్పించాం. ఉదయం 9 గంటల సమయంలో డ్యూటీ దిగాను. ఆ రోజు మేము చేర్పించిన అందరూ ప్రాణాప్రాయం నుంచి బయటపడ్డారు. 16 ఏళ్ల సర్వీసులో ఆ ఘటన గుర్తొచ్చినప్పుడల్లా ఒళ్లు గగుర్పాటుకు గురవుతుంది. మర్రిపాలెంలో నివాసం ఉంటున్న నేను.. ప్రస్తుతం వన్‌టౌన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నా.

– షేక్ మహమ్మద్ అలీ, పైలట్

అర్ధరాత్రి.. క్యాబిన్‌లో డ్రైవర్..



రోడ్డు పక్కనే క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న ఈఎంటీ గణేశ్వరరావు(ఫైల్)

మూణ్నెళ్ల కిందట. ఆనందపురం సమీపంలో జాతీయ రహదారి.. రాత్రి ఒంటి గంట సమయం. తాళ్లవలస పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా హైవేపై వెళ్తున్న లారీని వెనకనే వస్తున్న కొరియర్ వెహికల్ డ్రైవర్ ఢీకొట్టాడు. వాహనం డ్రైవర్ వైపు సగభాగం లారీలోకి చొచ్చుకుపోయింది. వెంటనే సమాచారం అందుకున్న మేము సంఘటన స్థలానికి వెళ్లాం. వాహనం బయటకు తీస్తే తప్ప ఆయన్ని కాపాడలేం. నైట్ పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు చేరుకున్నారు. ఎదురుగా ఫైర్ సిబ్బంది తాళ్లు తీసుకొచ్చి ఇంకో వాహనంతో కొరియర్ వాహనాన్ని బయటకు తాగుతుంటే.. మేము స్ట్రెచర్ పట్టుకుని అక్కడకు వెళ్లాం. అప్పటికే డ్రైవర్ రెండు కాళ్లు విరిగిపోయి ఉన్నాయి. విపరీతంగా రక్తం కారుతోంది. ఒంటి పైన కూడా అక్కడక్కడ దెబ్బలు తగిలి ఉన్నాయి. వాహనాన్ని పూర్తిగా లాగిన తర్వాత డ్రైవర్‌ను స్ట్రెచర్‌పై ఎక్కించి డ్రెస్సింగ్ చేశాను. వెంటనే కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించాను. బీఎస్సీ చదివిన నేను 12 ఏళ్లుగా 108లో పనిచేస్తున్నాను.



– వి.గణేశ్వరరావు, ఈఎంటీ, భీమిలి

130 కిలోమీటర్లు.. 20 రోజుల పసిబిడ్డ..



ఓ ఘటనలో క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పైలట్ రాధాకృష్ణ(ఫైల్)

అప్పటికే ముగ్గురు బిడ్డలు మృత్యువాత పడి.. నాలుగో బిడ్డ ప్రాణాప్రాయ స్థితిలో ఉండగా ఆ తల్లి పడిన క్షోభను మాటల్లో చెప్పలేను. ఆ సమయంలో ఆ బిడ్డను కాపాడి ఆ తల్లి కళ్లలో చూసిన ఆనందం ఎప్పటికీ మర్చిపోలేను. 108లో నా సర్వీస్ మూడేళ్లే. ఎన్నో కేసులు చూసినా ఈ కేసు మాత్రం నాకు ప్రత్యేకం. నా పేరు కె.రాధాకృష్ణ. దేవీమెట్ట(కొమ్మాది). 108లో పైలట్‌గా మొదట విశాఖ ఏజెన్సీలో విధుల్లో చేరాను. 2021లో అరకు ఏరియా ఆస్పత్రిలో 20 రోజుల పసిబిడ్డ ఆక్సిజన్ అందక ప్రాణాపాయస్థితిలో ఉందని ఫోన్ వచ్చింది. నేను, మా ఈఎంటీ విజయలక్ష్మి వెంటనే ఆస్పత్రి వద్దకు చేరుకున్నాం. బిడ్డ తల్లిది సుంకరిమెట్ట. అప్పటికే ఆమెకు ముగ్గురు బిడ్డలు జన్మించగా వివిధ కారణాలతో వారంతా చనిపోయారు. నాలుగో బిడ్డ పుట్టి 20 రోజులే అయింది. ఆస్పత్రి నుంచి బిడ్డను ఇంటికి తీసుకెళ్లగా.. పచ్చకామెర్లు సోకడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ హార్ట్‌బీట్ తగ్గిపోతోంది. మేము వెళ్లే సరికి 90 వద్ద ఉంది. మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని సూచించారు. సాధ్యమైనంత స్పీడ్‌గా డ్రైవ్ చేసి బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లి.. ఎలాగైనా బతికించాలని నేను, ఈఎంటీ నిర్ణయించుకున్నాం. బిడ్డకు ఈఎంటీ యాంబో పెట్టి శ్వాస అందించే ప్రయత్నం చేసింది. నా ప్రయాణం మొదలైంది. అరకు ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు దాదాపు 130 కిలోమీటర్లు. నాలుగు గంటల ప్రయాణం. ఆ రోజు విపరీతమైన వర్షం. అడుగుకో మలుపు.. గోతులు.. ఆ గోతుల్లో చేరిన వర్షం నీరు. ఇన్ని ప్రతికూలతల మధ్య ప్రయాణం సాగుతోంది. ఘాట్ రోడ్డు దిగి ఎస్.కోట దాటాం. మా వాహనంలోని యాంబో సరిగా పనిచేయడం లేదేమోనని.. కొత్తవలస 108 సిబ్బందికి ఫోన్ చేశాం. బిడ్డ హార్ట్‌బీట్ క్రమంగా తగ్గిపోతోంది. 60.. 30.. ఒక్కసారి మా గుండె ఆగినంత పని అయిపోయింది. పైగా కోవిడ్ రెండో దశ. ఏదైతే అదే అవుతుందని కొత్తవలస సమీపంలో బండిని పక్కకు ఆపాను. బిడ్డ నోటికి క్లాత్ అడ్డంగా పెట్టి కృత్రిమ శ్వాస అందించే ప్రయత్నం చేశాను. మా ప్రయత్నం సఫలీకృతం అయింది. బిడ్డ హార్ట్‌బీట్ క్రమంగా పెరిగింది. కొత్తవలసకు చెందిన వాహనంలో యాంబో తీసుకుని బిడ్డకు మళ్లీ ఆక్సిజన్ అందించాం. 33.. 40అలా పెరిగింది. పెందుర్తి, ఎన్ఏడీ మీదుగా కేజీహెచ్‌కు చేరుకున్నాం. అప్పటికి 100కు చేరుకుంది. వెంటనే వైద్యులు చికిత్స అందించారు. బిడ్డ సేఫ్. తల్లి హ్యాపీ.. మేము డబుల్ హ్యాపీ..



– కె.రాధాకృష్ణ, భీమిలి పైలట్

లంచ్ చేద్దామని క్యారియర్ తీశాం.. ఇంతలో ఈఎంటీ ఫోన్ చేసి..



ఓ రోజు మధ్యాహ్న భోజన సమయం. అప్పుడు నేను విజయనగరం టౌన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నా.. నేను, మా ఈఎంటీ లంచ్‌కు క్యారియర్ ఓపెన్ చేసేందుకు సిద్ధమయ్యాం. కరెక్ట్‌గా అదే సమయంలో డ్యూటీ దిగిన మరో ఈఎంటీ ఫోన్ చేసి.. విజయనగరం ప్రాంతంలో మేజర్ యాక్సిడెంట్ జరిగింది. బైక్‌పై వెళ్తూ తండ్రీకొడుకులు ఇద్దరూ ప్రమాదానికి గురయ్యారు. వెంటనే రండి.. అంటూ ముగించాడు. వెంటనే క్యారియర్‌ను మళ్లీ బండిలోనే పెట్టేసి.. బయలుదేరాం. కరెక్ట్‌గా స్పాట్ చేరేటప్పటికి 108 కాల్ సెంటర్ నుంచి మాకు ఈ కేసు అసైన్ అయింది. అయితే అప్పటికే ఘటనా స్థలానికి చేరుకున్న మాకు పబ్లిక్ నుంచి ఊహించని పరిణామం ఎదురైంది. 'ఎప్పుడ్రా కాల్ చేశాం.. ఇప్పుడు వస్తారా? మీ సంగతి చూస్తాం..' అంటూ దుర్భాషలాడారు. అవేమి పట్టించుకోకుండా ఘటనా స్థలానికి వెళ్తే కుమారుడు అక్కడికక్కడే మృతి చెంది ఉన్నాడు. తండ్రి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. తండ్రిని స్ట్రెచ్చర్‌పై ఎక్కించి.. ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తీసుకెళ్లాం. నిజానికి 108 కాల్ సెంటర్ నుంచి కేసు అసైన్ అయిన తర్వాత మేము బయలుదేరాలి. కానీ తోటి ఉద్యోగి సమాచారం ఇవ్వడంతో నమ్మదగినదిగా భావించి.. వెంటనే బయలుదేరాం. కాల్ సెంటర్ నుంచి ఫోన్ వచ్చే సమయానికే మేము సంఘటన స్థలంలో ఉన్నాం. అయినప్పటికీ పబ్లిక్ నుంచి అలాంటి పరిస్థితి ఎదురైంది.. 108లో 17 ఏళ్లుగా సర్వీస్ చేస్తున్నా.. దాదాపు 14 ఏళ్లు విజయనగరంలో విధులు నిర్వర్తించాం. నా భార్యకు సచివాలయంలో ఉద్యోగం రావడంతో ఇక్కడకు బదిలీపై వచ్చా..

–బంగార్రాజు, పైలట్, పద్మనాభం



దువ్వాడలో జరిగిన ఘటనలో విద్యార్థినికి సెలైన్ అందిస్తున్న ఈఎంటీ కోటినాయుడు(ఫైల్)

నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్నారు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 51 అంబులెన్స్‌లు ఉన్నాయి. పైలట్లు, ఈఎంటీలు ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్నారు. 2022 జూన్‌లో 2,326, జూలైలో 2,541, ఆగస్టులో 2,597, సెప్టెంబర్‌లో 2,336, అక్టోబర్‌లో 2,316, నవంబర్‌లో 2,095, డిసెంబర్‌లో 2,562 కేసులకు 108 అంబులెన్స్ ద్వారా సేవలందించాం. ఐసీయూలో ఉండే అన్ని పరికరాలు 108లో అందుబాటులో ఉన్నాయి. వాహనాల నిర్వహణ, వైద్య పరికరాల పరిశీలన, పైలట్ లైసెన్స్‌ల తనిఖీ నా విధి. అత్యవసర సమయాల్లో బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్లిన సంఘటనలూ ఉన్నాయి.

–ఎం.సురేష్, 108 జిల్లా మేనేజర్



బాధితురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న జిల్లా మేనేజర్ సురేష్(ఫైల్)

మిద్దెతోట.. ప్రతి ఇంటికీ ఆరోగ్య బాట

- ప్రముఖ రైతు సలహాదారు కర్రి రాంబాబు
- 2వ రోజూ ఆర్గానిక్ మేళాకు విశేష స్పందన



మిద్దెతోట కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు



పక్షుల ఆహారం కోసం తయారు చేసిన ధాన్యం కుంచెలు చూస్తున్న వైవీ సుబ్బారెడ్డి

ఎంవీపీకాలనీ: మిద్దెతోట పంటలతో ప్రతి ఇంటా ఆరోగ్యం, ఆహ్లాదం సాధ్యమవుతాయని ప్రముఖ రైతు సలహాదారు కర్రి రాంబాబు అన్నారు. ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో 'విశాఖ ఆర్గానిక్ మేళా–2023' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రకృతి సేద్యంపై అవగాహనతో పాటు పంటల ప్రదర్శన, ఉత్పత్తుల విక్రయాలు ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఈ మేళాలో భాగంగా శనివారం జరిగిన మిద్దెతోట అంశంపై జరిగిన శిక్షణా కార్యక్రమంలో రాంబాబు మాట్లాడారు. ప్రతి ఇంటా మిద్దెతోటల ఉంటే.. పరోక్ష వ్యాయామ శాలలు, జ్ఞానమందిరాలు ఉన్నట్లే అన్నారు. ఈ తోటల్లో కొంతసేపు శ్రమ చేస్తే వ్యాయామంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తాయన్నారు. ఇంటి పైకప్పు మీద పంటలు పండించేందుకు ఎటువంటి మట్టి వినియోగించాలి, ఏ సీజన్‌లో ఏ పంటలు పండించాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ సీజన్ల వారిగా వేసే పంటలు, వాటికి వచ్చే జబ్బుల నివారణపై అవగాహన కల్పించారు. భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి మాట్లాడుతూ మిద్దె తోటలు పెంచే వారు నగరైతులేనన్నారు. వారి సంఖ్య పెరిగితే నగరాల్లో ప్రజారోగ్యం, ఆరోగ్యకరమైన వాతావరణం సాకారమవుతాయన్నారు. అనంతరం మిద్దెతోట పంటల్లో చైతన్యానికి కృషి చేస్తున్న జట్టు భావ సమాఖ్య నిర్వాహకురాలు పద్మజను నిర్వాహకులు సత్కరించారు. ఈ శిక్షణలో పాల్గొన్న మహిళ రైతులకు పద్మజ తదితరులు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేళా గౌరవ అధ్యక్షుడు జీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ జీఎస్ఎన్ రాజు, కార్యదర్శి యుగంధర్ రెడ్డి, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, రైతు మిత్రా టెర్రస్ గార్డెన్ నిర్వాహకుడు దాట్ల వర్మ, గ్రీన్‌క్లైమేట్ అధ్యక్షుడు జేవీ రత్నం, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి షణ్ముఖరావు పాల్గొన్నారు.

మేళాను సందర్శించిన వైవీ సుబ్బారెడ్డి

ఆర్గానిక్ మేళా–2023ను టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సందర్శించారు. తొలుత మేళా ముఖద్వారం రంగోళి వద్ద రోకలి పోటు వేశారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన సేంద్రియ ఉత్పత్తులను పరిశీలించారు. మేళాలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ఫుడ్ స్టాల్‌ను సందర్శించిన ఆయన మిల్లెట్స్ అల్పాహారాన్ని స్వీకరించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఎన్ఎండీసీ క్రికెట్ టోర్నీ ప్రారంభం



జట్ల సభ్యులతో డీఆర్ఎం అనూప్‌కుమార్

విశాఖ స్పోర్ట్స్: ఎన్ఎండీసీ కప్ క్రికెట్ టోర్నీ వాల్తేర్ రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో శనివారం ప్రారంభమైంది. స్థానిక నాలుగు క్రికెట్ జట్లు ఈ టోర్నీలో తలపడుతుండగా పోటీలు రెండు రోజుల పాటు జరగనున్నాయి. ప్రారంభమ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన డీఆర్ఎం ఎలెవెన్ జట్టు మూడు వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. జశ్వంత్(51)అర్ధసెంచరీ చేశాడు. ప్రతిగా ఎంఎంఎస్ఎస్ జట్టు 13 ఓవర్లు పాటు ఆడి రెండే వికెట్లు కోల్పోయి 127 పరుగుల వద్ద ఆట ముగించింది. దీంతో కేవలం ఒక్క పరుగు తేడాతో పరాజయం పాలైంది. చిన్మయ్‌కుమార్ 61 పరుగులు చేశాడు. మరో మ్యాచ్‌లో ఎన్ఎండీసీ ఎలెవెన్ నాలుగు వికెట్లకు 106 పరుగులు చేయగా ఆర్ఐఎన్ఎల్ ఎలెవెన్ రెండే వికెట్లు కోల్పోయి 110 పరుగులతో విజయాన్నందుకుంది. తొలిరోజు జరిగిన మూడో మ్యాచ్‌లో ఎంఎంఎస్ఎస్ ఎలెవెన్ మూడు వికెట్లకు 92 పరుగులు చేయగా ఎన్ఎండీసీ ఎలెవెన్ రెండు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. మరో మ్యాచ్‌లో ఆర్ఐఎన్ఎల్ ఎలెవెన్ మూడు వికెట్లకు 99 పరుగులు చేయగా డీఆర్ఎం ఎలెవెన్ ఐదు వికెట్లు కోల్పోయి 88 పరుగులే చేసి పరాజయం పాలైంది. తొలుత ఈ పోటీలను రైల్వే గ్రౌండ్‌లో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించగా ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ డి.కె.మహంతి, ఎన్ఎండీసీ ప్రాంతీయ మేనేజర్ నిరంజన్‌నాయక్ హాజరయ్యారు.

పవర్ లిఫ్టింగ్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందచేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం (గాజువాక): జాతీయ సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ పవర్ లిఫ్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో జరుగుతున్న 27వ జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భాగంగా శనివారం సబ్ జూనియర్ కేటగిరీలో పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, డెడ్ ప్రెస్ కేటగిరీల్లో ఫైనల్స్ నిర్వహించారు. పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపి అస్సాంకు చెందిన గోగియా స్ట్రాంగ్ మేన్ అవార్డు గెలుపొందారు. బెంచ్ ప్రెస్ పోటీల్లో అస్సాంకు చెందిన గున్నై సూపర్ మేన్ అవార్డు కైవసం చేసుకోగా డెడ్ లిఫ్ట్ పోటీల్లో మహారాష్ట్రకు చెందిన కరీముల్లా రా మేన్ అవార్డు గెలుపొందారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌నాథ్ సింగ్, లియో పీటర్, నేషనల్ ఆఫీషియల్ అండిబోయిన లక్ష్మీదేవి, ఏపీ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భాస్కరరావు, అండిబోయిన అప్పారావులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్‌లో వాక్‌థాన్. మిస్ ఇండియా, సినీ నటి శోభిత ధూళిపాళ్ల పాల్గొంటారు.
- ఉదయం 11గంటలకు నోవాటెల్‌లో గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ముగింపు సమావేశం

జ్యోతిరావు పూలే యునైటెడ్ ప్యానల్ గెలుపు



విజేతలకు అధికారిక పత్రం అందజేస్తున్న జీఎం సంజీవరావు, రిటర్నింగ్ అధికారి జేవీ రావు

ఉక్కునగరం (గాజువాక): స్టీల్‌ప్లాంట్ ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో జ్యోతిరావు పూలే యునైటెడ్ ప్యానల్ విజయం సాధించింది. ఎన్నికల్లో మూడు ప్యానళ్లు పోటీ పడ్డాయి. ఇందులో ప్యానల్–1కు 96 ఓట్లు లభించగా, జ్యోతిరావు పూలే ఫౌండర్స్ ప్యానల్‌కు 864 ఓట్లు వచ్చాయి. విజేతగా నిలిచిన యునైటెడ్ ప్యానల్ 1294 ఓట్లు సాధించి, తమ ప్రత్యర్థి ప్యానల్‌పై 430 ఓట్ల తేడాతో విజయం సాధించినట్టు రిటర్నింగ్ అధికారి జె.వి.రావు తెలిపారు.

ప్రశాంతంగా ఎన్నికలు

శనివారం ఉదయం 6 గంటలకు ఉక్కు క్యూఏటీడీ, ఎల్ అండ్ డీసీ కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభమైంది. మొత్తం 2942 ఓట్లకు గాను ఉదయం 10 గంటల వరకు 777 ఓట్లు పోలవగా, మధ్యాహ్నం 2 గంటలకు 1600 ఓట్లు పోల్ కాగా 3 గంటల వరకు 2005 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 2,260 ఓట్లు పోలయ్యాయి. 4 గంటలకు పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను ఎల్‌అండ్‌డీసీ కేంద్రానికి తరలించి, 5 గంటలకు కౌంటింగ్ ప్రారంభించారు. కౌంటింగ్ అనంతరం రిటర్నింగ్ అధికారి జె.వి. రావు ఫలితాలను వెల్లడించారు. యునైటెడ్ ప్యానల్ నాయకులకు హెచ్ఆర్ జీఎం సంజీవరావు, ఆర్వో జె.వి.రావు అధికారిక ధ్రువపత్రం అందజేశారు. ప్యానల్ అధ్యక్షుడు బి. అప్పారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులను పలువురు అభినందించారు.

అంతర్ మీడియా క్రికెట్ టోర్నీలో 'సాక్షి' విజయం



బ్యాటింగ్ చేస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



విజయానందంలో సాక్షి జట్టు సభ్యులు

విశాఖ స్పోర్ట్స్: సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. పోర్ట్ స్టేడియంలో 'సాక్షి', లోకల్ చానల్ జట్ల మధ్య శనివారం జరిగిన మ్యాచ్‌ను ప్రారంభిస్తూ ఆమె మాట్లాడారు. కాసేపు బ్యాటింగ్ చేసి ఇరు జట్లలో ఉత్సాహం నింపారు. ముందుగా టాస్ గెలిచిన 'సాక్షి' జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. లోకల్ చానల్స్ జట్టు 16 ఓవర్లలో 105 పరుగులు చేసింది. జగదీష్ 47 పరుగులు చేశాడు. ప్రతిగా సాక్షి జట్టు 14.3 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. సుధీర్ 44 పరుగులు చేశాడు. వసంత్ మూడు వికెట్లు తీశాడు. మరో మ్యాచ్‌లో ఎలక్ట్రానిక్ మీడియా జట్టు 68 పరుగులకే ఆలౌట్ కాగా సతీష్ నాలుగు వికెట్లు తీశాడు. ప్రతిగా ఆంధ్రజ్యోతి జట్టు ఆరు వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. చిరంజీవి ఐదు వికెట్లు తీశాడు. వీజేఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.